దౌల్తాబాద్‌లో ఓటు ప్రాధాన్యంపై బైక్‌ర్యాలీ నిర్వహించిన దృశ్యం

ఓటు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

హత్నూర, ఏప్రిల్ 18: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ తెలిపారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరుకూడా ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు వేయాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసి ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రుణాల రికవరీని వేగవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం జయశ్రీ

మనూరు, ఏప్రిల్ 18: మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల రికవరీని వేగవంతంగా పూర్తి చేయాలని డీపీఎం జయశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐకేపీ సమావేశ మందిరంలో పలు గ్రామాల వీఓఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న కొత్త, పాత రుణాల రికవరీ కావాలంటే ప్రతి నెలా సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. స్త్రీ నిధి రుణాలు అవసరమైన సభ్యులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలపై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, కంప్యూటర్ ఆపరేటర్ సంజీవులు, సీసీలు పాల్గొన్నారు.

వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా

విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న ఏబీసీడీఓ భాగ్యలక్ష్మి

పుల్కల్, ఏప్రిల్ 18: మండలంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని గురువారం ఏబీసీడీఓ భాగ్యలక్ష్మి తనిఖీ చేశారు. వసతి గృహా ల్లో ఉంటూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారా, లేదా అంటూ హాస్టల్ వార్డెన్ నరేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ముందుగా విద్యార్థుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, లేదా అంటూ ఆరా తీశారు. వసతి గృహంలోని వంటశాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. వసతి గృహంలోని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో హాస్టల్ వార్డెన్‌ను అభినందించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం

కల్హేర్‌లో అంబలి పోస్తున్న సీహెచ్‌వో గంగదర్

కల్హేర్, ఏప్రిల్ 18: మండల కేంద్రమైన కల్హేర్ గ్రామానికి చెందిన బీహెచ్‌ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగి దోసిలి కిషన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సీహెచ్‌వో గంగాధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ప్రయాణికులు, గ్రామ ప్రజలకు వేసవిలో దాహార్తిని తీర్చేందుకు అంబలి, చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్యానికి మంచి విటమిన్స్‌ను అందించే రాగి(తైదలు) అంబలిని ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.

ఎంఐజీలో చలివేంద్రం ఏర్పాటు

చలివేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 18: భారతీనగర్ డివిజన్‌లోని ఎంఐజీలో సింధూఆదర్శ మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుతున్న ఎండలతో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయన్నారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛందసంస్థలు, యువజన సంఘాలు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో రాణి, నస్రీన్, సునీత, శ్రీలత, అరుణజ్యోతి, స్వర్ణవాణి, లక్ష్మి, స్వర్ణలత, కల్యాణి, సంధ్య, సత్యనారాయణ, తారసింగ్, పాషా, సంపత్‌గౌడ్, గోపాల్, రాకేశ్, రామస్వామి, మోహన్‌రావు, డైరెక్టర్లు రాములు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పని కల్పించాలి

కోహీర్, ఏప్రిల్ 18: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పని కల్పించాలని ఎంపీడీవో భారతి అన్నారు. గురువారం కోహీర్ పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పని కావాలని అడిగిన వారికి వెంటనే జాబ్‌కార్డు అందించి పని చూపించాలన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మొక్కలు ఎండిపోయే అవకాశం ఉంటుందన్నారు. నర్సరీలు, పలు ప్రాంతాల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీవో సునందరావు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- ఎస్ఎస్ఎస్‌సీ కౌన్సిల్ సమావేశంలో ఎస్పీ రూపేశ్
- పాల్గొన్న బొల్లారం, బొంతపల్లి, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల పారిశ్రామికవేత్తలు

ఎస్ఎస్ఎస్‌సీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

గుమ్మడిదల, ఏప్రిల్ 18: భద్రతపై ప్రత్యేకమైన అవగాహనతోనే పరిశ్రమల్లో తరుచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించవచ్చని ఎస్పీ రూపేశ్ తెలిపారు. గురువారం మండలంలోని బొంతపల్లి హెటిరో పరిశ్రమ యూనిట్ -1లో పారిశ్రామిక ప్రతినిధులతో ఎస్పీ ఎస్ఎస్ఎస్‌సీ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ సంజీవరావు, ఎస్ఎస్ఎస్‌సీ జీఎస్ సత్యనారాయణ, హెటిరో జీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, జిన్నారం, బొల్లారం సీఐలు సుదీర్‌కుమార్, గంగాధర్, ట్రాఫిక్ సీఐ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఇటీవల తరచూ జరుగుతున్న కెమికల్, అగ్ని ప్రమాదాలను నివారించడానికి పారిశ్రామికవేత్తలు పరిశ్రమల్లోని ఉద్యోగులకు, కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమలు ఉమెన్ సేఫ్టీ, కార్మికుల భద్రత తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఇటీవల పాశమైలారం, హత్నూర, బొల్లారం పారిశ్రామిక వాడలో జరిగిన అగ్ని ప్రమాదాలతోపాటు కెమికల్ ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తినష్టం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా యాజమాన్యాలు చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో జరిగే ఉత్పత్తిపై అవగాహన ఉంటే ప్రమాద తీవ్రతను గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలు ఉంటాయన్నారు.

రిస్క్ ఆపరేషన్ టీమ్ ఏర్పాటు చేయాలి

ప్రతి పరిశ్రమలో రిస్క్ ఆపరేషన్ టీం ఏర్పాటు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని ఎస్పీ అన్నారు. పారిశ్రామిక వాడలో మూసివేసిన పరిశ్రమల్లో మాదక ద్రవ్యాలైన డైజోఫామ్, క్లోరోఫామ్ లాంటి ఉత్పత్తులు తయారు చేస్తున్నారని, ఇదీ సమాజానికి మంచిది కాదన్నారు. ఇలాంటి వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి పరిశ్రమలో వ్యర్థాలు బయటకు పంపించకుండా పరిశ్రమలోనే కెమికల్ డంపింగ్‌లు ఏర్పాటు చేసి ప్రకృతికి హాని జరగకుండా చూడాలన్నారు. హత్నూర పారిశ్రామిక వాడలోని బీఆర్ ఆర్గానిక్ పరిశ్రమలో జరిగిన ప్రమాద వీడియోను పారిశ్రామికవేత్తలకు చూపించారు. ప్రతి పారిశ్రామిక వాడలో సీఎస్ఆర్ నిధులతో రోడ్లు, ఫైర్ ఇంజన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్ఎస్ఎస్‌సీ వలన ఇండస్ట్రీ, పోలీస్ మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేలా చూస్తున్నామన్నారు. ప్రతి ఐలాలో కెమికల్ ప్రమాదాలు, ఫైర్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి

ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధి ఆనంద్‌రావు మాట్లాడుతూ బొల్లారం, జిన్నారం, బొంతపల్లి పారిశ్రామిక వాడలో ఫైర్ స్టేషన్ లేకపోవడంతో అగ్ని ప్రమాదాలను త్వరగా అదుపులోకి తేలేకపోతున్నామన్నారు. పారిశ్రామికవాడల్లో తప్పనిసరిగా ఫైర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్లు సరిగా లేక వ్యర్థ జలాలతో బొల్లారంలోని ఆసానికుంట పూర్తిగా కలుషితం అయ్యిందన్నారు. అనంతరం న్యూలాండ్ పరిశ్రమ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ కలుషితమైన నీళ్లు వస్తున్నాయని స్థానికులు హెచ్చరిస్తున్నారన్నారు. కలుషిత జలాల నివారణకు పారిశ్రామికవేత్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెటిరో పరిశ్రమ ప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పారిశ్రామిక వేత్తలు

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి

కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

- అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలి
- జిల్లా ఎన్నికల, రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం నుంచి నామినేషన్ ప్రక్రియ మొదలైందని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి తెలిపారు. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా హైల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఈ హెల్ప్ డెస్క్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్ప్ డెస్క్‌లో నామినేషన్ దరఖాస్తులు ఉచితంగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు విధిగా ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని సూచించారు. నామినేషన్ సమయంలో బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చులను ఈ బ్యాంకు ఖాతా నుంచే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇతర సందేహాలకు కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భగీరథ నీటి సరఫరా నిలిపివేత

చక్రియాల్‌వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హత్నూర, ఏప్రిల్ 18: హత్నూర, జిన్నారం, గుమ్మడిదల మండలాలతోపాటు మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు శుక్రవారం మిషన్ భగీరథ నీళ్లు రావని మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. పుల్కల్ మండలం చక్రియాల్ వద్ద బోర్పట్ల మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడ్డ లీకేజీ వల్ల నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. శుక్రవారం మరమ్మతు పనులు పూర్తిచేసి శనివారం యదావిధిగా నీటిసరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ సీఐ శ్రీకాంత్, సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు, విపత్తులు సంభవించినపుడు పాటించాల్సిన నియమాలను వివరించారు. ఇంట్లో గ్యాస్ వినియోగిస్తున్నప్పుడు సిలిండర్‌కు మంటలు అంటుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగపూర్వకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ధైర్యంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మల్లిక, ఎన్‌సీసీ అధికారి కృష్ణప్రియ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జోగినాథ ఆలయంలో ప్రత్యేక పూజలు

జోగినాథ స్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

అందోల్, ఏప్రిల్ 18: జోగిపేటలోని జోగినాథ స్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం జోగినాథస్వామి ఉత్సవ విగ్రహానికి(వెండి విగ్రహం) అభిషేకం, విశేష పూజలు నిర్వహించి ఆలయం నుంచి గౌని చౌరస్తా వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఉత్సవకమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివశంకర్, సురేందర్‌గౌడ్, శివశేఖర్, నాగభూషణం, వెంకటేశం, చింతల సురేశ్, రంగసురేశ్, అవుసలి ప్రభాకర్, రెడ్డిపల్లి బ్రహ్మయ్య, యాదగిరి, శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కోహీర్ పట్టణంలోని రామ మందిరంలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు

కోహీర్, ఏప్రిల్ 18: కోహీర్ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని రామ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలోని సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా రథోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో కల్యాణకృష్ణ రాందాస్ మహారాజ్, గిరిజ, శ్రీనివాస్, గణేశ్‌రెడ్డి, శైలజ, శాంతి పాల్గొన్నారు.

కంకర తేలి, గుంతలుగా మారిన బర్దీపూర్ నుంచి చీలపల్లి వెళ్లే రోడ్డు

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?

ఝరాసంగం, ఏప్రిల్ 18: మెరుగైన రవాణా వ్యవస్థ ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధిపథంలో దూసుకుపోతాయి. అందుకు భిన్నంగా మండల పరిధిలోని గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిని నరకం చూపిస్తున్నాయి. కంకర తేలి, గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మాచునూర్ నుంచి బర్దిపూర్, జీర్లపల్లి నుంచి ఝరాసంగం, దిగ్వాల్ నుంచి ఝరాసంగం వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ రోడ్లపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా, వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నా అధికారులు, పాలకులు స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి అవసరమున్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కంకర తేలి, గుంతలుగా మారిన మాచ్‌నూరు నుంచి బర్దీపూర్ వెళ్లే రోడ్డు

మహిళ ను వేధించిన డీటీపై కేసు నమోదు

నారాయణఖేడ్, ఏప్రిల్ 18: వివాహితను వేధించిన డిప్యూటీ తహసీల్దార్‌పై నారాయణఖేడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం.. నారాయణఖేడ్ తహసీల్ కార్యాలయంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు నారాయణఖేడ్ పట్టణంలోని ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటున్నాడు. అదే ఇంట్లో ఓ ఉద్యోగి తన కుటుంబంతో అద్దెకు ఉంటున్నాడు. కొద్ది రోజులుగా డిప్యూటీ తహసీల్దార్ రాజు సదరు ఉద్యోగి భార్యతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇదేక్రమంలో గత బుధవారం సాయంత్రం సదరు మహిళ బట్టలు ఆరేస్తుండగా అక్కడే ఉన్న రాజు తనను వీడియోలు, ఫొటోలు తీస్తున్నట్లు గమనించి చెంప చెళ్లుమనిపించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోహీర్, ఏప్రిల్ 18: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, హార్టికల్చర్, డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ, ఫిషరీష్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని రంజోల్ సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇటీవల పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 18: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి నెల రోజులపాటు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, గజ్వేల్‌లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అండర్-14, 16, 19, 23 కేటగిరీల బాలబాలికలకు శిక్షణ ఉంటుందన్నారు. క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ www.hycricket.org ఆన్‌లైన్ లింక్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలి. క్రీడాకారులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలని స్పష్టం చేశారు. ఈ శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మే నెలలో జరిగే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేస్తామన్నారు. సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీ గ్రౌండ్స్, మెదక్ స్పోర్ట్స్ స్టేడియం, సిద్దిపేట ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియం, జహీరాబాద్‌లోని సంగమిత్ర, గజ్వేల్ ఐఓసీ గ్రౌండ్‌లలో శిబిరాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

యథేచ్ఛగా రసాయన వ్యర్థ జలాల విడుదల

పరిశ్రమ నుంచి కాల్వలోకి విడుదల చేస్తున్న రసాయన వ్యర్థ జలాలు

బొల్లారం, ఏప్రిల్ 18: పారిశ్రామికవాడలోని ఓ రసాయన పరిశ్రమ యథేచ్ఛగా రాత్రీపగలు అనే తేడా లేకుండా రసాయన వ్యర్థాలను ఆసానికుంట, ప్రధాన మురుగు కాల్వలోకి విడుదల చేస్తున్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ నిర్వాకంపై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేస్తున్న రసాయన వ్యర్థ జలాల వాసనలతో అనారోగ్యానికి గురై ఉక్కిరి బిక్కిరి అవుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే సదరు పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE AT : ZAHEERABAD

O.S. No. 168 of 2021

Between:
Smt. Pavuti @ Akula Saraswati & Others ...Plaintiffs
And
Smt. Pavuti @ Akula Sathemma, & Others ...Defendants

To
1. Sri.Pavuti Sangappa, S/o.Late Ashappa
2. Sri. Pavuti Pandappa, S/o.Late Ashappa, Both R/o. 5-58, Mogdampalli Village and Mandal, Sangareddy District.
3. Smt. Golla Swapna D/o. Akulka Ramappa, W/o. Pandu, R/o. Bardhipur Village, Jharasangam Mandal, Sangareddy District.
4. Smt. Pavuti Sulochana,D/o. Ramappa, Aged 20 Yrs, Occ: House Hold, R/o. 5-57, Mogdampalli Village and Mandal, Sangareddy District.

Please take notice that the above case is posted for your Appearance on 25-04-2024 before the Hon'ble Court at 10.30 AM. If you fail to Appear and defend the case, the case will be decided Exparte against you.

//BY ORDER OF THE COURT//

Sd/- P. Jaipal Reddy, Advocate
SANGAREDDY. Cell: 9440003620